



ప్రదర్శన నిర్వహిస్తున్న నాయకులు

స్ఫూర్తి ప్రదాత దామోదరం సంజీవయ్య

• జిల్లా కలెక్టర్, కర్నూలు ఎంపీ, ఎమ్మెల్యేలు • ఘనంగా దామోదరం సంజీవయ్య జయంతి

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

దామోదరం సంజీవయ్య స్ఫూర్తి ప్రదాతఅని పలువురు వక్తలు అభిప్రాయం వ్యక్తం చేశారు. శుక్రవారం మాజీ ముఖ్యమంత్రి దామోదరం సంజీవయ్య 104వ జయంతి సందర్భంగా నంద్యాల చెక్ పోస్ట్ కూడలి వద్ద ఉన్న దామోదరం సంజీవయ్య విగ్రహానికి జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా, కర్నూలు ఎంపీ బస్తిపాటి నాగరాజు, ఎమ్మెల్యేలు గౌరు చరిత, బొగ్గుల దస్తగిరి, వివిధ సంఘాల నాయకులు పూలమాల వేసి ఘనంగా నివాళులు అర్పించారు. కలెక్టర్ మాట్లాడుతూ దామోదరం సంజీవయ్య దేశంలోనే తొలిదళిత ముఖ్యమంత్రి అయి చరిత్ర సృష్టించారన్నారు. సమాజానికి స్ఫూర్తిప్రదాత దామోదరం సంజీవయ్య అని పేర్కొన్నారు. ప్రతి ఒక్కరికి ఆదర్శప్రాయులు, మార్గదర్శి అని కలెక్టర్ పేర్కొన్నారు.. కార్మిక శాఖా మంత్రిగా పని చేసే సమయంలో బోనస్‌లను ప్రకటించారని, వృద్ధాప్య పెన్షన్ వ్యవస్థను కూడా ప్రవేశపెట్టారని తెలిపారు. కర్నూలు ఎంపి మాట్లాడుతూ ఎస్సీ ఎస్టీ బీసీ సామాజిక తరగతుల కోసం ఎంతో పాటుపడ్డారన్నారు. వారి ఆశయాలను ఆదర్శంగా తీసుకుని కర్నూలు జిల్లాలో ఇరిగేషన్ ప్రాజెక్టులకు పెద్దపీట వేస్తామని పేర్కొన్నారు. ఎమ్మెల్యే లు మాట్లాడుతూ నిరుపేద ప్రజలకు ఆరు లక్షల ఎకరాల బంజరు భూములను పంచారని కొనియాడారు. ఇరిగేషన్‌కు సంబంధించి జిల్లాలో గాజులదిన్నె ప్రాజెక్ట్ ఏర్పాటు చేశారని, అందుకే ఆ ప్రాజెక్టుకు దామోదరం సంజీవయ్య ప్రాజెక్టుగా పేరు పెట్టారన్నారు. ఆ ప్రాజెక్టు ద్వారా మూడు నియోజకవర్గాలకు సాగు, తాగు నీటికి ఎలాంటి ఇబ్బంది లేకుండా ఉందన్నారు. కార్యక్రమంలో కర్నూలు ఆర్‌డిఒ సందీప్ కుమార్, దూరదర్శన్ డైరెక్టర్ రంగస్వామి, వాల్మీకి సంఘ కార్పొరేషన్ డైరెక్టర్ మంజునాథ్, ఎస్‌సి కార్పొరేషన్ డైరెక్టర్ పోతురాజు రవికుమార్, ఎస్‌సి కార్పొరేషన్ ఇడి, సాంఘిక సంక్షేమశాఖ జెడి తులసి, ఎస్‌సి, ఎస్‌టి సంఘాల నాయకులు, విద్యార్థి సంఘాల నాయకులు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కలెక్టర్ రంజిత్ బాషా



నివాళులర్పిస్తున్న కలెక్టర్ రంజిత్ బాషా



రాయలసీమలో నివాళులర్పిస్తున్న సిబ్బంది

రాయలసీమ వర్సిటీలో : రాయలసీమ యూనివర్సిటీలో దామోదరం సంజీవయ్య జయంతి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆయన చిత్రపటానికి ఇంచార్జ్ వైస్ ఛాన్సిలర్ ఎన్‌టికె నాయక్ పూలమాలలు వేసి నివాళులర్పించారు. సంజీవయ్య చేసిన సేవలను కొనియాడారు. రిజిస్ట్రార్ విజయ్‌కుమార్ నాయుడు, ఇతర విభాగాధిపతులు పాల్గొన్నారు.

ఒకేషనల్ జూనియర్ కళాశాలలో: కర్నూలులోని స్థానిక క్యాంప్ ప్రభుత్వ వొకేషనల్ జూనియర్ కళాశాలలో దామోదరం సంజీవయ్య జయంతి నిర్వహించారు. ప్రిన్సిపల్ డాక్టర్ ఎస్. నాగస్వామి నాయక్, బి-క్యాంప్ జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ సరళాదేవి,కళాశాల అధ్యాపకులు 'దామోదరం సంజీవయ్య' చిత్ర పటానికి పూల మాల వేసి నివాళులర్పించారు.

కాంగ్రెస్ కార్యాలయంలో: కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో దామోదరం సంజీవయ్య జయంతిని నిర్వహించారు. పార్టీ కార్యాలయం ముందుగల దామోదరం సంజీవయ్య కాంస్య విగ్రహానికి మాజీ ఎమ్మెల్సీ సుధాకర్ బాబు ఇతర కాంగ్రెస్ నాయకులు , పూలమాలలు వేసి నివాళు లర్పించారు.

ప్రభుత్వ పురుషుల డిగ్రీ కళాశాలలో: స్థానిక క్లస్టర్ విశ్వవిద్యాలయ పరిధిలోని కర్నూల్ బి క్యాంపు లోని ప్రభుత్వ పురుషుల డిగ్రీ కళాశాలలో మాజీ ముఖ్యమంత్రి దామోదరం సంజీవయ్య జయంతిని నిర్వహించారు.

కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఎం.ఇందిరాశాంతి అధ్యక్షతన నిర్వహించారు. ఆయన చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. వైస్ ప్రిన్సిపల్ హేమంత్ కుమార్, చరిత్ర అధ్యాపకులు జి.నాగేశ్వరరావు మాట్లాడారు. ఎ.సత్యనారాయణ, డాక్టర్ నాగన్న, డాక్టర్ మాదన్న, ఎ. వెంకటస్వామి, డాక్టర్ ఉమర్, మీనాక్షి , డాక్టర్ వింధ్యవాసిని, డాక్టర్ సోమశేఖర్ డాక్టర్ రోషన్న, తదితర అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

వక్ఫ్ బిల్లు ఏకపక్షం

- ఆవాజ్ నిరసన ప్రదర్శన

ప్రజాశక్తి- కర్నూలు కార్పొరేషన్

వక్ఫ్‌బిల్లు ఏకపక్షంగా ఆమోదించారని ఆవాజ్ అధ్యక్షులు పి.ఇక్బాల్ హుస్సేన్ ఆగ్రహం వ్యక్తం చేశారు. కర్నూలు మౌలానా అబుల్ కలాం ఆజాద్ చౌక్‌లో ఆవాజ్ నగర నాయకులు డి.అబ్దుల్ దేశాయి అధ్యక్షతన శుక్రవారం నిరసన తెలిపారు. ఆవాజ్ నగర కమిటీ అధ్యక్ష కార్యదర్శులు పి.ఇక్బాల్ హుస్సేన్ ,ఎస్ఎండి.షరీఫ్ మాట్లాడారు. వక్ఫ్ బిల్లు సవరణను జెపిసి కమిటీ నివేదికను ఆమోదించడాన్ని తప్పు బట్టారు. ప్రతిపక్షాల సభ్యుల అభిప్రాయాలను ఏమాత్రం పరిగణలోకి తీసుకోలేదన్నారు. నామ మాత్రపు జెపిసి వేశారని. వారి లక్ష్యం ఏదైతే ఉందో దాన్ని నెరవేర్చడం కోసం బిజెపి నాయకత్వం లోని ఎన్‌డిఎ ప్రభుత్వం కుట్రలు, కుతంత్రాలు చేస్తుందని ఎద్దేవా చేశారు. ప్రతిపక్ష సభ్యుల ఆందోళనల మధ్య వక్ఫ్ బిల్లుపై నివేదికకు పార్లమెంట్ ఉభయ సభల్లో ఆమోదం లభించిందని వారు ఆగ్రహం వ్యక్తం చేశారు. దీన్ని స్పీకర్ మూజువాని ఓట్లతో ఆమోదించారు. దీంతో ప్రతిపక్షాలు ఆందోళన చేపట్టినప్పటికీ ఏమాత్రం తమ అసమ్మతిని నివేదికలో జత చేయలేదన్నారు. ప్రతిపక్ష సభ్యుల సూచనలు ఏవి నివేదికలో పేర్కొనకుండా బిజెపి దాని మిత్రపక్షాల సూచనలన్నీ నివేదికలో పొందుపరచాలని ఆగ్రహం వ్యక్తం చేశారు. అది వాస్తవమైన నివేదిక కాదని బిజెపి దాని మిత్రపక్షాల నివేదికను వారు ఘాటుగా విమర్శించారు. కేంద్రహోంమంత్రి జోక్యం చేసుకొని ఈ బిల్లును తిరిగి జెపిసికి పంపాలని డిమాండ్ చేశారు. ఈ బిల్లు తిరిగి పార్లమెంట్లో కనుక ఆమోదానికి వస్తే ఆంధ్రప్రదేశ్ లోని టిడిపి కూటమి ప్రభుత్వం బీహార్‌లోని జెడియు నేత నితీష్ కుమార్ వ్యతిరేకించాలని డిమాండ్ చేశారు. ఆవాజ్ నగర సహాయ కార్యదర్శి నాసిర్ అహ్మద్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం తన మతోన్మాద అజెండాను చాలా వేగంగా అమలు చేస్తుందని ,దీనికి కళ్లెం వేయాల్సిన మన ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం కూడా చూసి చూడనట్లు వ్యవహరిస్తుందన్నారు. తక్షణమే వక్ఫ్ సవరణ బిల్లు అడ్డుకోవడానికి అవసరమైన ఆంధ్రప్రదేశ్ అసెంబ్లీలో వక్ఫ్ చట్ట సవరణను వ్యతిరేకిస్తూ ఎకగ్రీవంగా తీర్మానం చేయాలని డిమాండ్ చేశారు. ఆవాజ్ నగర నాయకులు ఇలియాజ్, ఫయాజుల్ కరీం, సయ్యద్ అహ్మద్, షాషావలి, మోయిన్, మునీర్ అహ్మద్, మహబూబ్ బాషా, ఫయాజ్ ఖాద్రి, అయూబ్, సలీం బాష పాల్గొన్నారు.

ఎన్‌ఆర్‌పేటలో బర్డ్ ఫ్లూ

- కిలోమీటర్ పరిధిని రెడ్ జోన్ గా ప్రకటన

ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్

కర్నూలు నగరంలోని ఎన్‌ఆర్‌పేటలో కోళ్లకు బర్డ్‌ఫ్లూ వచ్చినట్లు గుర్తించి వెంటనే వాటిని చంపేసినట్లు కర్నూలు నగర పాలక సంస్థ ప్రజా ఆరోగ్యాధికారి డాక్టరు విశ్వేశ్వర్ రెడ్డి చెప్పారు. వెంటనే ఆ ప్రాంతాలను పరిశీలించి ఎన్‌ఆర్‌పేటలో ఒక కిలోమీటరు పరిధిని రెడ్‌జోన్‌గా ప్రకటించామని తెలిపారు. రెడ్‌జోన్ ఏరియాగా ప్రకటించిన ఎన్‌ఆర్‌పేట ప్రాంతంలో శానిటేషన్ బ్లీచింగ్ చేసినట్లు తెలిపారు. సంకల్‌బాగ్, ఎన్‌ఆర్ పేట, ప్రకాష్ నగర్ ప్రాంతాలలో పది కిలోమీటర్ల పరిధిలో కోడి మాంసం, కోడి గుడ్లు అమ్మకాలను నిషేధించినట్లు తెలిపారు. గడియారం ఆసుపత్రి వద్ద నాటు కోళ్ల అమ్మే ప్రాంతాలను కూడా పరిశీలించి వాటిని అక్కడినుండి అమ్మకుండా పంపించినట్లు తెలిపారు. పశువైద్యాధికారి శ్రీనివాస్ మాట్లాడుతూ ఒక కోడికి మాత్రమే పాజిటివ్ వచ్చినట్లు గుర్తించామన్నారు. ప్రజలు ఎలాంటి భయభ్రాంతులకు గురి కావాల్సిన అవసరం లేదన్నారు. కోడిమాంసం , గుడ్లు బాగా ఉడికించి తిన్నట్లయితే ఎలాంటి సమస్య ఉండదని తెలిపారు.

ఆర్‌యు ఇంజినీరింగ్ ప్రిన్సిపల్‌పై వేటు..?

● మహిళా ప్రొఫెసర్‌పై లైంగిక వేధింపులు
● రూ.2 కోట్లకుపైగా అవినీతి, అక్రమాలు

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్



రాయలసీమ వర్సిటీ ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపల్ హరి ప్రసాద్ రెడ్డి తొలగింపునకు రంగం సిద్ధమైనట్లు తెలిసింది. లైంగిక వేధింపులు పాల్పడినట్లు రుజువు కావడంతోనే ఆయనపై చర్యలు తీసుకునేందుకు వర్సిటీఉన్నత అధికారులు సన్నద్ధమయ్యారు. రాయలసీమ యూనివర్సిటీ ఇంజనీరింగ్ కళాశాలలో 2019లో హరి ప్రసాద్ రెడ్డి నియమితులయ్యారు. ప్రిన్సిపల్‌పై అక్కడే పనిచేస్తున్న ఓ మహిళ ప్రొఫెసర్‌ను లైంగికంగా వేధిస్తున్నట్లు గతంలో వర్సిటీ ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లారు. పోలీస్ స్టేషన్‌లో కూడా సదరు ప్రొఫెసర్ ఫిర్యాదు చేయడంతో ఎఫ్ఐఆర్ కూడా నమోదు చేశారు. గతంలో పనిచేసిన వైస్ ఛాన్సలర్‌కు కూడా ఫిర్యాదు చేసినా పక్కకు పెట్టేశారు. అప్పటి ఉన్నత విద్యా మండలి చైర్మన్ పట్టించుకోలేదు. ఇటీవల కాలంలో మరోసారి మహిళా ప్రొఫెసర్ వర్సిటీ ఉన్నత అధికారులకు , ఉన్నత విద్యా మండలికి ఫిర్యాదు చేశారు. ఇంజనీరింగ్ కళాశాలలో రూ.రెండు కోట్లు కంప్యూటర్లు యుపిఎస్ బ్యాటరీల కొనుగోలులో పెద్ద ఎత్తున అవినీతి అక్రమాలకు పాల్పడ్డారు. ఎస్ఎఫ్ఐ విద్యార్థి సంఘం నాయకులు కూడా కళాశాల ప్రిన్సిపల్ అవినీతి అక్రమాల ఇతరపై ఫిర్యాదు చేశారు. వర్సిటీ వైస్ ఛాన్సలర్ ఆదేశాలకు మేరకు రిజిస్ట్రార్ ఫిర్యాదులపై త్రిమెన్ కమిటీతో కూడిన ఏర్పాటు చేశారు. ఈ కమిటీ సదరు ఫిర్యాదులపై విచారించి కళాశాల ప్రిన్సిపల్ పై ఆరోపణలు రుజువు అయినట్లు తెలిసింది. ఈ కమిటీ కళాశాల ప్రిన్సిపల్ పై చర్యలకు సిఫార్సు చేసినట్లు నివేదించినట్లు తెలిసింది.

బర్డ్ ఫ్లూపై ఆందోళన చెందవద్దు : మంత్రి భరత్

ప్రజాశక్తి-కర్నూలు క్రైమ్



బర్డ్ ఫ్లూ వ్యాధిపై ప్రజలు ఆందోళన చెందొద్దని రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్యం, ఫుడ్ ప్రాసెసింగ్ శాఖ మంత్రి టిజి భరత్ అన్నారు. కర్నూలులో బర్డ్ ఫ్లూ వ్యాపించిన విషయం తెలిసిన వెంటనే మంత్రి టిజి భరత్ జిల్లా కలెక్టర్‌తో ఫోన్‌లో మాట్లాడారు. ప్రస్తుత పరిస్థితిపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. వ్యాధిని నివారించేందుకు తీసుకోవాల్సిన చర్యలపై ఆరా తీశారు. బర్డ్ ఫ్లూతో చనిపోయిన వాటిని సక్రమంగా పూడ్చిపెట్టాలన్నారు. వ్యాధి వ్యాప్తి చెందకుండా ప్రభుత్వం జారీ చేసిన మార్గదర్శకాల ను తప్పకుండా పాటించాలని మంత్రి చెప్పారు. ప్రజలను ఎప్పటికప్పుడు అప్రమత్తం చేయాలని చెప్పారు. ఇక ప్రజలు సైతం బర్డ్ ఫ్లూ పై ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. తగిన జాగ్రత్తలు పాటించాలని ఆయన ప్రజలకు సూచించారు.

ఏళ్లు గడిచినా అర్హులకు ఇంటిస్థలం లేదు

- 60 సచివాలయం ముందు సిపిఎం ధర్నా

ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్

ప్రభుత్వాలు ఎన్ని మారినా పేదల జీవితాలు మారడం లేదని, అర్హులైన పేదలకు ఇంటి స్థలాలు ఇచ్చి, ఇల్లు నిర్మించి ఇవ్వడం లేదని 24వ వార్డు సిపిఎం నాయకులు శేషాద్రి అన్నారు. పేదలైన అర్హులకు ఇచ్చిన ఇంటిపట్టాకు స్థలం చూపి, ఇల్లులేని అర్హులైన వారందరికీ ఇల్లు నిర్మించాలని, టిడ్కో ఇండ్లకు సౌకర్యాలను మెరుగుపరిచి లబ్ధిదారులకు అందజేయాలని డిమాండ్‌తో 60వ సచివాలయం ఎదుట ధర్నా చేశారు. శేషాద్రి తదితరులు మాట్లాడుతూ 2008లో మాజీ ఎమ్మెల్యే ఎంఎ.గఫూర్ జగన్నాథగట్టులో నిర్మించిన గృహాలను ఆనాటి లబ్ధిదారులకు గృహ నిర్మాణం పూర్తి చేసి ఇవ్వాలనీ డిమాండ్ చేశారు. ఉమ్మడి రాష్ట్రంలో గత ప్రభుత్వం పట్టాలిచ్చిన వాటికి స్థలాలు చూపించి ఇల్లు నిర్మించాలన్నారు. ప్రస్తుత కూటమి ప్రభుత్వం రెండు సెంట్ల స్థలం అర్హులైన వారికి ఇస్తామని ప్రకటించిందని వెంటనే ఇచ్చి నిర్మాణం చేపట్టాలన్నారు. 60వ సచివాలయం లో ఎడ్యుకేషన్ సెక్రటరీ ప్రియాంకకు సిపిఎం వార్డు నాయకులు ఎ.లీలావతి, నగర నాయకులు శేషాద్రి, శ్రీను, చందు, స్థానిక నాయకురాలు రత్నమ్మ ,రమేష్ వినతిపత్రం ఇచ్చారు. 62 వ సచివాలయం ఎడ్యుకేషన్ సెక్రటరీ వేణుగోపాల చారికి కూడా సిపిఎం నాయకులు వి.వెంకటేశ్వర్లు, శేషాద్రి ,ఆనంద్, దస్తగిరి, ఈశ్వరమ్మ తదితరులు వినతి పత్రం సమర్పించారు.

ఆంధ్ర ప్రగతి గ్రామీణ బ్యాంక్

కడపలోనే కొనసాగాలి

- ఎపిజిబి రీజనల్ కార్యాలయం ఎదుట సిఐటియు ధర్నా

ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్

ఆంధ్ర ప్రగతి గ్రామీణ బ్యాంక్ ప్రధాన కార్యాలయాన్ని కడపలోనే కొనసాగించాలని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఎండి అంజిబాబు డిమాండ్ చేశారు. ఆంధ్ర ప్రగతి గ్రామీణ బ్యాంక్ ప్రధాన కార్యాలయం కడపలోనే కొనసాగించాలని కోరుతూ కర్నూలు భాగ్యనగర్‌లోని ఎపిజిబి బ్యాంకు రీజనల్ కార్యాలయం దగ్గర ధర్నా చేశారు. సిఐటియు ఓల్డ్ సిటీ కార్యదర్శి విజయ్ అధ్యక్షతన నిర్వహించిన ధర్నాలో ఎండి.అంజిబాబు, ఆంధ్ర ప్రగతి గ్రామీణ బ్యాంకు ఉద్యోగుల సంఘం నాయకులు హనుమంతరెడ్డి, సిఐటియు జిల్లా అధ్యక్షులు పిఎస్.రాధాకృష్ణ మాట్లాడారు.

పూర్తి వివరాలు మెయిన్ పేజీలో





గాయత్రి ఎస్టేట్ ఎస్‌బిఐ బ్రాంచి వద్దనిరసనను ఉద్దేశించి మాట్లాడుతున్న నాయకులు

మార్చి 24, 25 తేదీల్లో 48 గంటల నిరవధిక సమ్మె


ప్రజాశక్తి-కర్నూల్ హాస్పిటల్

బ్యాంకింగ్ రంగంలో పనిచేస్తున్న ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ మార్చి 24,25 తేదీల్లో 48 గంటల పాటు రెండు రోజులు నరవదిక సమ్మె చేపడుతున్నట్లు ఎఐబిఒసి, ఎన్‌సిబిఇ, ఎఫ్ బియు , ఆల్ యూనియన్ నాయకులు తెలిపారు. శుక్రవారం కర్నూలు నగరంలోని గాయత్రి ఎస్టేట్‌లో ఉన్న ఎస్‌బిఐ బ్రాంచ్ వద్ద యుఎఫ్‌బియు, ఐబిఒసి ఆధ్వర్యంలో ఉద్యోగులు నినాదాలు చేస్తూ ఆందోళన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ ఐదు రోజులు పని దినాలు, అన్ని క్యాడర్లో తగిన నియామకాలు, తాత్కాలిక ఉద్యోగులను రెగ్యులర్ చేయాలని డిమాండ్ చేశారు. పెండింగులో ఉన్న సమస్యలు పరిష్కారం కోసం, ఫీల్డ్ వర్క్‌మెన్ ఆఫీసర్, డైరెక్టర్ల నియామకం చేపట్టాలి కోరారు. బ్యాంకు ఉద్యోగుల సమస్యల పరిష్కారం కోసం మార్చి 24,25 తేదీల్లో చేపట్టే ఈ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎఐబిఒసి జీవుర్ రహమాన్, శివిరాజన్, నాగరాజు, సగన్ , ఉద్యోగులు పాల్గొన్నారు.

32వ వార్డులో రంగు మారిన నీళ్లు సరఫరా

ప్రజాశక్తి-కర్నూలు హాస్పిటల్

ముజఫర్ నగర్ లో గురువారం రాత్రి మున్సిపల్ కార్పొరేషన్ సిబ్బంది సరఫరా చేసిన తాగునీరు పసుపు రంగులో వచ్చాయి. సుమారు రెండు గంటల పాటు ఇలానే నిళ్లు రావడం చూసి ప్రజలు నిర్ఘాంత పోయారు. మరల రేపు నీళ్ల వస్తాయొ రావో అని పట్టుకున్నారు. సిపిఎం న్యూసిటీ నగర కార్యదర్శి వర్గ సభ్యులు సిహెచ్ సాయిబాబా అధికారులతో మాట్లాడారు.



మాట్లాడుతున్న న్యాసేవ అధివకారి, వేదికపై నిర్మల, రాయపాటి, జయలక్ష్మి తదితరులు

మార్కెట్ యార్డులో ఉచిత వైద్య శిబిరం

ప్రజాశక్తి-కర్నూలు అగ్రికల్చర్

కర్నూలు వ్యవసాయ మార్కెట్‌లో జిల్లా న్యాయ సేవ ఆధ్వర్యంలో రైతులకు శుక్రవారం హమాలీలకు కిమ్స్ హాస్పిటల్ ఉచిత వైద్య శిబిరం మార్కెట్ ఎంపిక శ్రేణి కార్యదర్శి జయలక్ష్మి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రైతులు హమాలీలు ఆరోగ్యం అన్నివిధాలుగా బాగుండాలన్నారు. అందులో భాగంగా ఇలాంటి ఉచిత వైద్య శిబిరాలు నిర్వహించడం శుభపరిణామం అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా న్యాయ సేవ అధికారులు న్యాయవాదులు నిర్మలమ్మ, ఎన్‌జిఒ నాయకులు రాయపాటి శ్రీనివాసులు పాల్గొన్నారు.

మురళీ కృష్ణకు ఉద్వాసన

ఆస్తుల వ్యవహారంలో కాంగ్రెస్ అధిష్టానం నిర్ణయం

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడిగా మాజీ ఎమ్మెల్యే పి.మురళీకృష్ణ తొలగిస్తూ పిసిసి అధిష్టానం నిర్ణయం తీసుకుంది. జిల్లా కాంగ్రెస్ కమిటీకి చెందిన ఆస్తుల వ్యవహారంలో ఆయన వ్యవహరించిన తీరు పట్ల పిసిసి అధిష్టానం స్పందించి విచారణ చేపట్టింది. పిసిసి మాజీ అధ్యక్షుడు గిడుగు రుద్రరాజు ఆధ్వర్యంలో నియమించిన కమిటీ నివేదించిన నివేదిక ఆధారంగా పి.మురళీకృష్ణను తొలగించారు. కొత్త అధ్యక్షుడుని ఎన్నుకునే వరకు నగర అధ్యక్షుడు జిలానిబాష పార్టీ కార్యకలాపాలను పర్యవేక్షించాలని ఆదేశించారు. ఇటీవల కాలంలో డిసిసి అధ్యక్షుడిగా పి మురళీ కృష్ణ జిల్లా కాంగ్రెస్ పార్టీకి చెందిన భవనాలను కళా వెంకట్రావు భవనం సొసైటీ పేరుతో రిజిస్ట్రేషన్ చేసుకోవడం పట్ల జిల్లాలోని కాంగ్రెస్ నేతలు పిసిసి అధ్యక్షురాలు వైఎస్. షర్మిలకు ఫిర్యాదు చేశారు. మురళీకృష్ణపేరు మీద ప్రత్యేకంగా సొసైటీని తయారుచేసి రిజిస్ట్రేషన్ చేసుకోవడం పట్ల పిసిసి అధిష్టానానికి నివేదించారు. గిడుగు రుద్రరాజు కమిటీ విచారణ చేపట్టింది. కమిటీ నివేదిక ఆధారంగా పి.మురళీకృష్ణను తొలగిస్తూ ఏఐసిసికి పిసిసి అధ్యక్షురాలు నివేదించారు.



మీడియాతో మాట్లాడుతున్న మాజీ అధ్యక్షులు కె.బాబురావు , తదితరులు

పిసిసి నిర్ణయాన్ని స్వాగతిస్తున్నాం
కాంగ్రెస్ నేతలు బాబురావు, జిలాని బాష

జిల్లా కాంగ్రెస్ కమిటీ ఆస్తుల వ్యవహారంలో పిసిసి అధిష్టానం తీసుకున్న నిర్ణయాన్ని స్వాగతిస్తున్నట్లు డిసిసి మాజీ అధ్యక్షుడుకె. బాబురావు, నగర అధ్యక్షుడు జిలానిబాష, ఐఎన్‌టియుసి జిల్లా నాయకులు బతుకన్నలు పేర్కొన్నారు. శుక్రవారం సాయంత్రం డిసిసి కార్యాలయంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ డిసిసి అధ్యక్షుని హోదాలో మురళీకృష్ణ పేరు మీద ఆస్తులను రిజిస్ట్రేషన్ చేసుకోవడం పట్ల అధిష్టానం దృష్టికి తీసుకెళ్లామన్నారు. అధిష్టానం స్పందించి గిడుగు రుద్రరాజు కమిటీని నియమించిందని, కమిటీ ఇచ్చిన నివేదిక ఆధారంగా మురళీ కృష్ణను డిసిసి అధ్యక్షులు నుండి తొలగింపుకు నిర్ణయం తీసుకుందన్నారు.

అధిష్టానం నిర్ణయానికి కట్టుబడి ఉంటా: పి.మురళీకృష్ణ

పిసిసి అధిష్టానం నిర్ణయానికి కట్టుబడి ఉంటారని ఉద్వాసనకు గురయిన పి.మురళీకృష్ణ ఓ ప్రకటనలో వెల్లడించారు. విధేయతతో పార్టీ కార్యక్రమాలను నిర్వహించానన్నారు. తనకు సహకరించిన పార్టీ నాయకులకు కార్యకర్తలకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

నైతిక విలువలతో కూడిన విద్యఅవసరం

జిల్లా విద్యాశాఖ అధికారి శామ్యుల్ పాల్

ప్రజాశక్తి - వెల్దుర్తి : నైతిక విలువలతో కూడిన విద్యను అందించాలని జిల్లా విద్యాశాఖ అధికారి శామ్యూల్ పాల్ అన్నారు. వెల్దుర్తి లోని స్థానిక పిఎంశ్రీ జిల్లా పరిషత్ బాలికల పాఠశాలలో రెండవ వార్షికోత్సవ వేడుకలను శుక్రవారం పాఠశాల హెచ్ఎం చంద్రావతి, ఎస్ఎంసి చైర్మన్ రాజేష్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ముఖ్యఅతిథి డిఇఒ శ్యాముల్ పాల్, వెల్దుర్తి మండల మాజీ ఎంపిపి జ్ఞానేశ్వర్ గౌడ్, టిడిపి సీనియర్ నాయకులు సుబ్బరాయుడు, సుధాకర్ గౌడ్, ఎంఇఒ ఇందిరా హాజరయ్యారు. పాఠశాలలోని ప్రగతి ప్రాజెక్టు వారి సహకారంతో రూ.64 లక్షల అభివృద్ధి పనులలో భాగంగా నూతనంగా నిర్మించిన కంప్యూటర్ ల్యాబ్, సైన్స్ ల్యాబ్ లను ప్రారంభించారు. విద్యార్థినుల సాంస్కృతిక నృత్యాలు, ఆట పాటలతో అలరించారు. జ్ఞానేశ్వర్ గౌడ్ మాట్లాడుతూ విద్యార్థులు పదవ తరగతిలో 100శాతం ఉత్తీర్ణత సాధించి జిల్లాలోని అగ్రమగామిగా నిలవాలని ఆకాంక్షించారు. పదవ తరగతి పరీక్షలలో పాఠశాలలో ప్రథమ ప్రతిభ కనబరిచిన విద్యార్థినికి టిడిపి యువ నాయకులు సుధాకర్ గౌడ్ రూ.20వేల బహుమతిగా అందజేస్తానని తెలిపారు. విద్యార్థినుల తల్లిదండ్రులు,ఉపాధ్యాయులు పాల్గొన్నారు



సమావేశంలో మాట్లాడుతున్న డిఇఒ శామ్యూల్‌పాల్

రజక కార్పొరేషన్‌కు రూ. వెయ్యికోట్లు ఇవ్వాలి

ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్

రజక కార్పొరేషన్ కు రూ.1000 కోట్లు నిధులు కేటాయించాలని ఆంధ్రప్రదేశ్ రజక వత్తిదారుల సంఘం కర్నూల్ జిల్లా కార్యదర్శి సి.గురుశేఖర్ డిమాండ్ చేశారు. శుక్రవారం ఆంధ్రప్రదేశ్ రజక వత్తిదారుల సంఘం కర్నూలు జిల్లా కమిటీ సమావేశం సి. ముక్కన్న అధ్యక్షతన వీరనారి ఐలమ్మ కార్యాలయంలో నిర్వహించారు. సి. గురుశేఖర్ మాట్లాడుతూ రజక కార్పొరేషన్కు 2025- 26 ఆర్థిక బడ్జెట్లో రజక కార్పొరేషన్ కు రూ.1000 కోట్లు నిధులు కేటాయించాలన్నారు. కర్నూలు జిల్లా లో నేటికీ కూడా బీసీలు 52 శాతం ఉన్నారన్నారు. ఇప్పుడు కూడా 30 శాతం మంది వృత్తిపై ఆధారపడి జీవన కొనసాగిస్తున్నారన్నారు. బీసీ కార్పొరేషన్ ద్వారా 1673 మందికి మాత్రమే రుణాలు ఇస్తామని బీసీ కార్పొరేషన్ అధికారులు వివిధ మండలాల కు టార్గెట్ ఇవ్వడం చాలా విడ్డూరంగా ఉందన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం ఆలోచించి వృత్తిదారులు ఆదుకోవాలన్నారు. ప్రభుత్వం తక్షణమే విశ్వకర్మ కౌశల్య యోజన లబ్ధిదారుల అకౌంట్లో ఆర్థిక రుణాన్ని జమ చేయాలని, లేనియెడల రాబోయే కాలంలో పెద్ద ఎత్తున ఉద్యమాలు చేపడతామని హెచ్చరించారు. జిల్లా ఉపాధ్యక్షులు శేషాద్రి రాముడు, శేఖర్ బాబు, పర్ల సుంకన్న, జిల్లా ట్రెజరర్ సిహెచ్. శ్రీనివాసులు సహాయ కార్యదర్శి సి .జయమ్మ పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న సి.గురుశేఖర్



రైతులకు ,రెవెన్యూ అధికారులకు సూచనలు చేస్తున్న జెసి డాక్టర్ బి.నవ్య

రీసర్వేను పరిశీలించిన జెసి

క్రిష్ణగిరి- ప్రజాశక్తి

క్రిష్ణగిరి మండలం ఎరుకలచెరువు గ్రామంలో భూముల రీ సర్వేను శుక్రవారం జాయింట్ కలెక్టర్ డాక్టర్ బి.నవ్య పరిశీలించారు. ఆమె మాట్లాడుతూ రైతులు సాగు చేస్తున్న వ్యవసాయ భూములను రైతుల సమక్షంలోనే రీ సర్వేచేస్తామని తెలిపారు. రైతుల పొలాలు రీ సర్వే చేసే ముందు రైతులకు తెలియజేసి రీ సర్వే చేసేందుకు అధికారులు పొలాలకు వస్తారని అన్నారు. రైతులు తమ పొలాలను రీ సర్వే చేసే సమయంలో తప్పనిసరిగా వెళ్లి పొలాల సరిహద్దులు చూపించాలన్నారు. రైతుల భూ సమస్యలను పరిష్కరించేందుకే ప్రభుత్వం రీ సర్వే కార్యక్రమాన్ని చేపట్టిందన్నారు. రీ సర్వేలో ఏ రైతుకు అన్యాయం జరగదన్నారు. అనంతరం తహశీల్దార్ కార్యాలయాన్ని సందర్శించి రిజిస్ట్రేషన్లు ఉన్నవి మాత్రమే పాసుబుక్కులు జారీ చేయాలని, డాక్యుమెంట్లు రూపంలో ఉన్నవి పాసుబుక్కులు జారీ చేయరాదన్నారు. తప్పనిసరిగా రిజిస్ట్రేషన్లు ఉండాలని ఎమ్మార్వోను ఆదేశించారు. ఆర్‌డిఒ భరత్ నాయక్, తాహశీల్దార్ దేవ.చంద్రశేఖర్, డిప్యూటీ తహశీల్దార్ లక్ష్మిరాజు విఆర్ఒలు వెంకటేశ్వర్లు, రాజశేఖర్ రెడ్డి,అయ్యన్న, నారాయణ, ప్రహ్లద్,నాగరత్నమ్మ పాల్గొన్నారు.

సంజీవయ్య సేవలను విస్మరిస్తున్న పాలకులు : సిపిఎం

ప్రజాశక్తి-కర్నూలు హాస్పిటల్

కర్నూలు కార్పొరేషన్ పరిధి 36వ వార్డు పెద్దపాడులో ఉన్న దామోదర సంజీవయ్య బాలికల హాస్టల్‌ను బాలుర హాస్టల్ ను సిపిఎం పార్టీ ప్రతినిధి బృందం కర్నూలు నగర కార్యదర్శి టి.రాముడు, వార్డు నాయకులు ఎన్ .గోపీనాథ్. వరలక్ష్మి, కె.శ్రీనివాసులు, మౌలాలి,మహేష్, యేసు రాజు పరిశీలించారు. అమరజీవి దామోదర సంజీవయ్య జయంతి సందర్భంగా సంజీవయ్య విగ్రహం దగ్గర నివాళులు అర్పించారు. సిపిఎం నగర కార్యదర్శి టి.రాముడు మాట్లాడుతూ అమరజీవి సంజీవయ్య పేదదళిత కుటుంబంలో జన్మించి అంచలంచలుగా ఎదుగుతూ దేశం గర్వించే నాయకునిగా స్వాతంత్ర సమరయోధునిగా, కేంద్ర కార్మిక శాఖ మంత్రిగా ఉమ్మడి రాష్ట్రంలో ముఖ్యమంత్రిగా దేశానికి రాష్ట్రానికి ఎనలేని సేవలు అందించారని అన్నారు. అలాంటి గొప్ప నాయకుని పేరుపై ఉన్న పెద్దపాడు బాలికల హాస్టల్ పాలకులు అధికారులు పట్టించుకోకపోవడం వలన శిధిలావస్థకు చేరిందన్నారు. స్లాబ్ పై పెంకులు ఊడిపడి కడ్డీలు తేలాయన్నారు. సంజీవయ్య ఇల్లు రేకుల షెడ్ ఎలాంటి అభివృద్ధికి నోచుకోలేదని అన్నారు. ఇలాంటి గొప్ప నాయకులు పేరుపై ఉన్న బాలికల, బాలుర హాస్టళ్లలను అభివృద్ధి చేయడానికి రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక దృష్టి పెట్టాలని అన్నారు. సంజీవయ్య జీవించిన ఈ స్థలంలో మ్యూజియం, లైబ్రరీని నిర్మించి రాబోయే తరాలకు ఆయన చేసిన సేవలను తెలిపే విధంగా చూడాలని డిమాండ్ చేశారు.

నేడు స్వచ్ఛాంధ్ర, స్వచ్ఛత దివస్

- ఏర్పాట్లు పరిశీలించిన సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్
- హాజరుకానున్న కలెక్టర్ రంజిత్ బాషా

ప్రజాశక్తి - గోనెగండ్ల


రీసర్వేను పరిశీలిస్తున్న సబ్ కలెక్టర్

గోనెగండ్లలో శనివారం నిర్వహించనున్న స్వచ్ఛాంధ్ర, స్వచ్ఛత దివస్ కార్యక్రమానికి కలెక్టర్ పి.రంజిత్ బాషా, జిల్లా ఉన్నతాధికారులందరూ హాజరుకానున్నట్లు ఆదోని సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్ తెలిపారు. శుక్రవారం గోనెగండ్లలోని చెత్త సంపద తయారీ కేంద్రం వద్ద జరుగుతున్న ఏర్పాట్లను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. గోనెగండ్లలో నిర్వహించే స్వచ్ఛ దివస్ ర్యాలీలో కలెక్టర్, అధికారులు, ప్రజలు పెద్దఎత్తున పాల్గొంటారని తెలిపారు. స్వచ్ఛాంధ్రలో భాగంగా అందరూ కలిసి శ్రమదానం చేస్తామన్నారు. అనంతరం గ్రామంలో సేకరించిన వ్యర్థాలను రీసైకిల్ చేసి సంపదను సృష్టించుకోవడంతో పాటు గ్రామాన్ని స్వచ్ఛ గ్రామంగా తీర్చిదిద్దుకునేందుకు దోహదపడే చెత్త సంపద కేంద్రాన్ని కలెక్టర్ పూర్తిస్థాయిలో ప్రారంభించి పరిశీలిస్తారన్నారు.

రీ సర్వే పరిశీలన : సమగ్ర భూ సర్వేలో భాగంగా పైలట్ గ్రామం కింద గోనెగండ్లలో జరుగుతున్న రీ సర్వేను సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్, తహశీల్దార్ కుమారస్వామితో కలిసి పరిశీలించారు. ఆదోని డిఎల్‌పిఒ నూర్జహాన్, ఎంపిడిఒ మణిమంజరి, ఇఒఆర్‌డి అనంతశయన, సర్పంచ్ హైమావతి, పంచాయతీ కార్యదర్శి సతీష్, వీఆర్, ఆర్ఐఎస్ ఎఐ శంకర్, శ్రీనివాసులు రెడ్డి పాల్గొన్నారు.

ప్రభుత్వ లాంఛనాలతో డీఎస్పీ అంత్యక్రియలు

ప్రజాశక్తి - ఆస్పరి


ప్రభుత్వ లాంఛనాలతో అంత్యక్రియలు నిర్వహిస్తున్న సిబ్బంది

ఆస్పరి గ్రామానికి చెందిన డీఎస్పీ నాగరాజు (53) అంత్యక్రియలు శుక్రవారం ప్రభుత్వ లాంఛనాలతో జరిగాయి. ఆస్పరి గ్రామానికి చెందిన నాగరాజు రాజమండ్రి సిఐడి కార్యాలయంలో డీఎస్పీగా విధులు నిర్వహిస్తున్నారు. స్థానికంగా లాడ్జిలో ఉంటూ డ్యూటీకి వెళ్లేవారు. సాయంకాలం దేవాలయం పక్కనే అపస్మారక స్థితిలో పడి ఉండగా స్థానికులు ప్రభుత్వాస్పత్రికి తరలించగా అప్పటికే మృతి చెందారని వైద్యులు తెలిపారు. కుటుంబ సభ్యులు రాజమండ్రి నుంచి మృతదేహాన్ని ఆస్పరి గ్రామానికి తీసుకొచ్చి అంత్యక్రియలు నిర్వహించారు. విధి నిర్వహణలో తనతో పాటు పని చేసిన పోలీసు ఉన్నతాధికారులు నాగరాజు మృతదేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. మృతునికి భార్య చంద్రకళ, ఒక కుమారుడు, ఒక కుమార్తె ఉన్నారు.

'ఉపాధి పెండింగ్ వేతనాలు చెల్లించాలి'

ప్రజాశక్తి - దేవనకొండ

పెండింగ్‌లో ఉన్న ఉపాధి వేతనాలు చెల్లించాలని వ్యకాస మండల అధ్యక్షులు చాకలి కృష్ణ, మండల ఉపాధ్యక్షులు సి.బజారి, వై.నాగేశ్వరరావు డిమాండ్ చేశారు. శుక్రవారం వ్యకాస మండల సమితి ఆధ్వర్యంలో ఉపాధి కూలీల సమస్యలపై ఏపీడీ, ఏపీఓ రాజు నాయక్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. ఉపాధి హామీ చట్టం కింద పనులు చేసిన కూలీలకు వేతనాలు ఇవ్వడంలో ప్రభుత్వాలు నిర్లక్ష్యం చేస్తున్నాయని విమర్శించారు. పని ప్రదేశంలో కనీస వసతులు కల్పించకపోవడంతో కూలీలు పనులకు వెళ్లడానికి ఆసక్తి చూపడం లేదన్నారు. ఉపాధి హామీ పని దినాలను 200 రోజులకు పెంచి, రూ.500 కనీస వేతనం చెల్లించాలని కోరారు. ఉపాధి హామీ పనులు చేసుకుని బతికే పేద, మధ్యతరగతి కుటుంబాలకు చాలీచాలని వేతనాలు ఇవ్వడంతో పిల్లాపాపలతో సుదూర ప్రాంతాలకు వలస వెళ్లే దుస్థితి నెలకొందని తెలిపారు. ఉపాధి పెండింగ్ వేతనాలు సకాలంలో మంజూరు చేయాలని, లేనిపక్షంలో వ్యకాస ఆధ్వర్యంలో దశలవారీ ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. వ్యకాస మండల నాయకులు భాస్కర్, నరేష్, శంకర్, రఫీ, కోదండ, డేవిడ్, శ్రీనివాసులు, కోదండ రాముడు పాల్గొన్నారు.

18న అంతర్ రాష్ట్ర బండలాగుడు పోటీలు

ప్రజాశక్తి - దేవనకొండ

మండలంలోని కొత్తపేట గ్రామంలో హజరత్ దివానే మస్తాన్‌వలీ ఉరుసు సందర్భంగా ఈనెల 18న అంతర్ రాష్ట్ర బండలాగుడు పోటీలు నిర్వహిస్తున్నట్లు సర్పంచి పెద్దయ్య కుమారుడు బాబు, గ్రామ పెద్దలు మస్తాన్, తిక్కయ్య, చంద్రశేఖర్, దర్గా కమిటీ నిర్వాహకులు తెలిపారు. శుక్రవారం వారు మాట్లాడారు. పోటీల్లో పాల్గొనే వృషభ యజమానులు ఈనెల 16లోపు రూ.500 ప్రవేశ రుసుం చెల్లించి పేర్లు నమోదు చేసుకోవాలని కోరారు. గెలుపొందిన వృషభాలకు మొదటి బహుమతి రూ.50 వేలు నజీర్, ఖాదర్ బాష, ద్వితీయ బహుమతి రూ.30 వేలు బెల్దార్ మస్తాన్, మూడో బహుమతి రూ.20 వేలు హనుమంత రెడ్డి, సోమన్న, నాలుగో బహుమతి రూ.15 వేలు వెంకట సాయి ట్రేడర్స్, ఐదో బహుమతి రూ.10 వేలు మాదన్న అందజేయనున్నట్లు తెలిపారు. వివరాలకు 9705186481, 9676324390, 9010623540 ఫోన్ నెంబర్లకు సంప్రదించాలని కోరారు.

నేషనల్ హైవే మరమ్మతులు చేపట్టాలి

- వామపక్షాల డిమాండ్

ప్రజాశక్తి - ఆలూరు

ఆగిన నేషనల్ హైవే రోడ్డు మరమ్మతులు చేపట్టాలని వామపక్షాలు డిమాండ్ చేశాయి. శుక్రవారం ఆలూరులో వామపక్షాల ఆధ్వర్యంలో రోడ్డు సైడ్ వ్యాపారులు, ప్రజా సంఘాల నాయకులు రాస్తోరోకో చేపట్టారు. ట్రాఫిక్ స్తంభించడంతో ఎస్ఐ దిలీప్ కుమార్ సంఘటన స్థలానికి చేరుకొని రాస్తోరోకో విరమించాలని వామపక్ష నాయకులతో వాగ్వాదానికి దిగారు. సమస్యకు పరిష్కారం చూపే వరకు విరమించబోమని నాయకులు తెలిపారు. ఎస్ఐ దిలీప్ కుమార్ నేషనల్ హైవే డిఇకి ఫోన్ చేసి సమస్యను వివరించారు. 20 రోజుల్లో మరమ్మతులు చేపడతామని తెలపడంతో రాస్తోరోకోను విరమించారు. ఈ సందర్భంగా సిపిఎం ఆలూరు ప్రాంతీయ కార్యదర్శి పి.హనుమంతు, సిపిఐ జిల్లా సమితి నాయకులు భూపేష్ మాట్లాడారు. ఆదోని నుంచి చింతకుంటకు వేయాల్సిన రోడ్డును కాలయాపన చేస్తూ ఆలూరులో ఉన్న రోడ్డును తొలగించారని, తర్వాత నూతన రోడ్డు వేయకుండా నిలిపేశారని తెలిపారు. రహదారి నిత్యం రద్దీగా ఉంటుందని, దుమ్ము, ధూళితో వాహనదారులు, రోడ్డు సైడ్ వ్యాపారులు, ప్రజలు అనారోగ్యం బారిన పడుతున్నారని చెప్పారు. అధికారులు, పాలకుల నిర్లక్ష్యమే ఈ పరిస్థితికి కారణమన్నారు. గడువులోపు పనులు చేపట్టకపోతే ప్రజలను సమీకరించి ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. సిపిఎం, సిపిఐ నాయకులు మైనా, విఠల్, రామాంజనేయులు, రంగన్న పాల్గొన్నారు.


రాస్తారోకో నిర్వహిస్తున్న వామపక్ష నాయకులు

విద్యతోనే ఉజ్వల భవిష్యత్తు : ఎంపిడిఒ

ప్రజాశక్తి - కౌతాళం


విద్యార్థులను అభినందిస్తున్న ఎంపిడిఒ

విద్యతోనే ప్రతి విద్యార్థి ఉజ్వల భవిష్యత్తును నిర్మించు కోగలరని ఎంపిడిఒ సుబ్బరాజు తెలిపారు. రైజింగ్ నాలెడ్జ్ అబాకస్ ఒలంపియాడ్ వారు నిర్వహించిన జిల్లాస్థాయి అబాకస్ టాలెంట్ టెస్ట్‌లో ప్రతిభ ఇంగ్లీష్ మీడియం హైస్కూల్ విద్యార్థులు ప్రతిభ కనబరిచి ద్వితీయ, తృతీయ బహుమతులను కైవసం చేసుకున్నారు. శుక్రవారం ప్రతిభ పాఠశాలలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రతి విద్యార్థిలో ఏదో ఒక నైపుణ్యం దాగి ఉంటుందని తెలిపారు. ఉపాధ్యాయులు విద్యార్థుల నైపుణ్యాన్ని గ్రహించి ప్రస్తుత సమాజంలో క్రమశిక్షణ, నైతిక విలువలు కలిగిన విద్యను అందిస్తే విద్యార్థులు సమాజ అభివృద్ధికి తోడ్పాటు అందించగలరని సూచించారు. సెక్రటరీ మైనుద్దీన్ మాట్లాడుతూ... పాఠశాలలో విద్యార్థులు పోటీ పరీక్షల్లో ప్రతిభ కనబరిచేలా తీర్చిదిద్దడమే లక్ష్యంగా ముందుకెళ్తున్నామని తెలిపారు. అనంతరం ద్వితీయ, తృతీయ బహుమతులు గెలుపొందిన విద్యార్థులకు జ్ఞాపికలు, మెడల్స్, ప్రశంసాపత్రాలు అందజేసి అభినందించారు. కరస్పాండెంట్ సయ్యద్ దూద్ బాషా, ప్రధానోపాధ్యాయులు జ్ఞానేశ్వరి, జయలక్ష్మి, భీమేష్, శ్రీను పాల్గొన్నారు.

సర్వేను వేగవంతం చేయండి

- నోడల్ అధికారి రఘు

ప్రజాశక్తి- దేవనకొండ

దేవనకొండ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో ఆరోగ్య కార్యకర్తలు నిర్వహిస్తున్న సంక్రమిత, అసంక్రమిత వ్యాధులపై నిర్వహిస్తున్న సర్వేను వేగవంతం చేయాలని జిల్లా సంచార చికిత్స కార్యక్రమ నోడల్ అధికారి డాక్టర్ రఘు సూచించారు. శుక్రవారం స్థానిక ఎస్సీ కాలనీలో నిర్వహిస్తున్న సర్వేను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ప్రజల్లో మారిన ఆహారపు అలవాట్లు, శారీరక శ్రమ లేకపోవడం వంటి కారణాలతో రక్తపోటు, షుగర్, క్యాన్సర్ లాంటి వ్యాధులు, మద్యం సేవించడం, పొగాకు ఉత్పత్తుల లాంటివి తాగడంతో దీర్ఘకాలిక వ్యాధుల బారిన ప్రజలు పడుతున్నారని తెలిపారు. సంక్రమిత, అసంక్రమిత వ్యాధులపై (ఎన్‌సిడి-సిడి) అనారోగ్య సమస్యలను తెలుసుకునేందుకు సర్వే నిర్వహిస్తున్నామన్నారు. సామాజిక ఆరోగ్య అధికారులు, ఆరోగ్య కార్యకర్తలు, ఆశా కార్యకర్తలు ఇంటింటి సర్వే చేసి క్యాన్సర్‌పై ప్రజలకు అవగాహన కల్పించాలని, క్యాన్సర్ లక్షణాలు ముందుగానే గుర్తించి సకాలంలో వైద్య సేవలు అందిస్తే వ్యాధి నివారణకు దోహదపడుతుందని తెలిపారు. రోజూ సిబ్బంది 40 గృహాలను సందర్శించి అనుమానిత రోగులను గుర్తించి వారిని తదుపరి పరీక్షలకు ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి పంపాలన్నారు. వైద్యాధికారి డాక్టర్ విజయ భాస్కర్, సామాజిక ఆరోగ్య అధికారి మంజుభార్గవి, ఆరోగ్య బోధకులు జయలక్ష్మి, సచివాలయ ఆరోగ్య కార్యకర్త వెంకటమ్మ, ప్రొజెక్షనిస్ట్ ఖలీల్ ఉన్నారు.

16 నుంచి అన్నదానం

ప్రజాశక్తి-ఆదోనిరూరల్



మహాశివరాత్రి పండగ సందర్భంగా శ్రీశైలం వెళ్లే భక్తులకు ఈనెల 16 నుంచి 20 వరకు అన్నదానం చేస్తున్నట్లు నిర్వాహకులు మహర్షి విజయ్ కుమార్ శుక్రవారం తెలిపారు. స్థానిక ఎమ్మిగనూరు బైపాస్ రోడ్డులో వేదికను ఏర్పాటు చేసి పాదయాత్ర వెళ్లే భక్తులకు దాతల సహకారంలో అన్నదానం చేస్తున్నట్లు తెలిపారు. ఆదివారం ఉదయం శివపార్వతుల కళ్యాణోత్సవం అనంతరం పాదయాత్ర భక్తులకు అన్నదాన కార్యక్రమం ప్రారంభిస్తామన్నారు.

రాజకీయ కక్షతోనే వంశీ అరెస్టు

- ఎమ్మెల్యే విరుపాక్షి

ప్రజాశక్తి - చిప్పగిరి

ఎప్పుడో రెండేళ్ల క్రితం జరిగిన ఘటనకు బాధ్యులను చేసి కూటమి ప్రభుత్వం కక్షతోనే వల్లభనేని వంశీని అరెస్టు చేయించిందని ఎమ్మెల్యే బి.విరుపాక్షి విమర్శించారు. శుక్రవారం చిప్పగిరిలో ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో అంబేద్కర్ రాజ్యాంగం లేదని, కేవలం లోకేష్ రెడ్ బుక్ రాజ్యాంగం నడుస్తోందని విమర్శించారు. కూటమి నాయకులు పరిపాలన చేయడానికి రాలేదని, లోకేష్ పాదయాత్రలో ఎవరి పేర్లు రెడ్ బుక్‌లో రాసుకున్నారో వారిపై అక్రమ కేసులు బనాయించి అరెస్టులు చేస్తున్నారని తెలిపారు. ఇది ఇప్పటితో ఆగదని, ప్రభుత్వంపై విమర్శలు చేసే వైసిపి నాయకులను లక్ష్యంగా చేస్తూ అక్రమంగా అరెస్టులు చేస్తున్నారని మండిపడ్డారు. సూపర్ సిక్స్ పథకాలు అమలు చేయకుండా ప్రజలను పక్కదారి పట్టించడానికి ఏదో ఒక సంఘటన తెరమీదకు తెస్తూ కాలయాపన చేస్తున్నారన్నారు. సూపర్ సిక్స్ పథకాలు అమలు చేయాలంటే బడ్జెట్ లేదని ప్రజలకు మాయ మాటలు చెబుతున్నారని తెలిపారు. జగన్మోహన్ రెడ్డి అప్పులు ఎక్కువగా చేశారని తప్పుడు మాటలు చెప్పి ప్రజలను మోసగిస్తున్నారని విమర్శించారు. కేవలం టాంపరింగ్ వల్లే అధికారంలోకి వచ్చామని కూటమి నాయకులకు కూడా తెలుసన్నారు. సాధ్యం కానీ హామీలు ఇచ్చినందున, వాటిని అమలు చేయలేక వైసిపి నాయకులను లక్ష్యంగా చేస్తూ, అక్రమ అరెస్టులు చేయడం సిగ్గుచేటన్నారు. అక్రమ అరెస్టులపై ఉన్న శ్రద్ధ పరిపాలనపై లేదన్నారు. ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చకుండా ఇలా నాయకులను భయపెట్టి కాలం వెళ్లబుచ్చుతున్నారని విమర్శించారు. అధికారులు కూడా వారి మాటలు విని ఇలా అక్రమ మార్గంలో అరెస్టులు చేయకూడదన్నారు. ఎప్పుడూ వారు అధికారంలో ఉండరన్నారు. ఇది తెలుసుకొని అధికారులు మసలుకోవడం మంచిదన్నారు. ఇకనైనా ఇలాంటి అక్రమ అరెస్టులు విడిచిపెట్టి ప్రజలకు ఏం కావాలో.. ఇచ్చిన హామీలను నెరవేర్చుతూ ప్రజల మనస్సు గెలుచుకోవాలని హితవుపలికారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే విరుపాక్షి

కటికపేటలో రోడ్ల నిర్మాణం చేపట్టాలి : సిపిఎం

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు

మున్సిపాలిటీ 10వ వార్డులో కటిక పేట, చంద్రయ్య కొట్టాలలో రోడ్లు వెంటనే నిర్మించాలని సిపిఎం ఆధ్వర్యంలో నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా సిపిఎం పట్టణ కార్యదర్శి గోవిందు, పట్టణ కమిటీ సభ్యులు సురేష్, చర్మకారుల సంఘం జిల్లా అధ్యక్షులు ఆంథోని మాట్లాడారు. మున్సిపాలిటీ వారు వీధుల్లో రోడ్లు వేసే సందర్భంగా కనీసం తనిఖీ లేకుండా నిర్మించడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. రోడ్ల నిర్మాణ పనులు జరిగే చోట మున్సిపల్ ఇంజినీరింగ్ అధికారులు ఉండడం లేదని విమర్శించారు. పనుల్లో నాణ్యత లోపించడమే కాకుండా ఎగుడుదిగుడు రోడ్లను నిర్మిస్తున్నారని తెలిపారు. కటిక పేటలో, చంద్రయ్య కొట్టాల రోడ్లు నిర్మించడానికి గతంలో గుంతలు తవ్వి వాటిని అలాగే వదిలి వేయడం వల్ల స్థానికులు ప్రమాదాలకు గురై ఆస్పత్రి పాలవుతున్నారని చెప్పారు. అధికారులు, కాంట్రాక్టర్లు పట్టించుకోవడం లేదని విమర్శించారు. రోడ్లు నిర్మించిన వెంటనే డ్రెయినేజీ సౌకర్యం కూడా కల్పించాలని కోరారు. గతంలో ఎమ్మిగనూరు పట్టణంలో అండర్‌గ్రౌండ్ డ్రెయినేజీకి రూ.కోట్లు ఖర్చు చేసినా వాటిని నేటికీ ఉపయోగించుకోక పోవడం దురదృష్టకరమని అన్నారు. మున్సిపల్ అధికారులు అండర్‌గ్రౌండ్ డ్రెయినేజీ సౌకర్యాన్ని పట్టణ ప్రజలు ఉపయోగించుకునేటట్లు చేయాలని కోరారు. మార్చి నుంచి మేలోపు రోడ్ల నిర్మాణాన్ని పూర్తి చేయాలని డిమాండ్ చేశారు. మెయిన్ రోడ్లనే కాకుండా చివరి ప్రాంతాల్లో ఉన్న స్లమ్ ఏరియా రోడ్లు, డ్రెయినేజీ, తాగునీటి సౌకర్యాన్ని పూర్తి చేయడానికి ప్రభుత్వం కృషి చేయాలని కోరారు. సిపిఎం కార్యకర్తలు సుభాన్, అబ్దుల్ బాష, బజారి, పరమేష్, ఈరన్న, లక్ష్మి, పులిరాజు, నాగరాజు పాల్గొన్నారు.


రోడ్డుపై నిరసన తెలియజేస్తున్న సిపిఎం నాయకులు


మాట్లాడుతున్న మీనాక్షి నాయుడు


మాజీ ఎంపిటిసికి మీనాక్షి నాయుడు పరామర్శ

ప్రజాశక్తి-ఆదోనిరూరల్

మండలంలోని దొడ్డనకేరి మాజీ ఎంపిటిసి శివప్పను టిడిపి ఇన్‌ఛార్జీ మీనాక్షి నాయుడు శుక్రవారం పరామర్శించారు. శివప్ప వారం రోజుల క్రితం రోడ్డు ప్రమాదానికి గురయ్యారు. దొడ్డనకేరి గ్రామంలోని నివాసానికి వెళ్లి శివప్పను మీనాక్షి నాయుడు పరామర్శించారు. ఆయన మాట్లాడుతూ... కార్యకర్తలకు అండగా ఉంటామని, ఎలాంటి ఆపద వచ్చినా ఆదుకోవడానికి సిద్ధంగా ఉంటామని భరోసా ఇచ్చారు. శివప్ప త్వరగా కోలుకొని పార్టీకి మరిన్ని సేవలు అందించాలని ఆకాంక్షించారు. టిడిపి మండల నాయకులు ఆరెకల్ రామకృష్ణ, పాండవగల్ అయ్యన్న, హనవాల్ మహబూబ్ బాషా పాల్గొన్నారు.

వంకలో ముళ్ల చెట్లు, వ్యర్థాలను తొలగించండి

- ఎస్సీ కాలనీ వాసుల విజ్ఞప్తి


వినతిపత్రం అందజేస్తున్న కాలనీవాసులు

ప్రజాశక్తి - నందవరం

వంకలో వ్యర్థాలను, ముళ్లచెట్లను తొలగించాలని ఎస్సీ కాలనీ వాసులు కోరారు. శుక్రవారం ఎంపిడిఒ పుల్లయ్యకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. గ్రామానికి, ఎస్సీ కాలనీకి మధ్య ఉన్న వంకలో ముళ్ల చెట్లు, వ్యర్థాలు పేరుకుపోయాయని తెలిపారు. వర్షాకాలం వచ్చిందంటే చిన్నపాటి వర్షానికి వాగు నిండి వంతెన పైనుంచి నీరు ప్రవహిస్తోందని చెప్పారు. నీటి ప్రవాహం తగ్గే వరకు గ్రామంలోకి రావడానికి వీలుండదని తెలిపారు. మూడేళ్ల క్రితం కురిసిన వర్షానికి ఈ వాగులో ఉన్న వ్యర్థాలు, చెట్ల వల్ల నీరు ముందుకు వెళ్లలేక తమ వీధిని ఐదు రోజులుగా దిగ్బంధించిందని చెప్పారు. ఐదు రోజులు బయటకు వెళ్లకుండా బిక్కుబిక్కుమంటూ గడిపామని తెలిపారు. ఆ వరదలో ప్రభుత్వాస్పత్రి ఆవరణ మునిగిపోయిందని, ఇలాంటివి పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలని కోరారు. జై భీమ్ ఎంఆర్‌పిఎస్ మండల ఇన్‌ఛార్జీ చింపిరి పోతప్ప, మండల ప్రధాన కార్యదర్శి శాంతిరాజు, ఎంఆర్‌పిఎస్ నాయకులు హాలహర్వి మణికుమార్, గ్రామ నాయకులు గంధాలం తాయన్న, ఆనంద్ పాల్గొన్నారు.

బాలల హక్కుల పరిరక్షణ అందరి బాధ్యత

- ఆర్‌డిటి, ఐసిడిఎస్


ప్రజాశక్తి - గోనెగండ్ల

బాలల హక్కులను పరిరక్షించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని ఐసిడిఎస్ సిడిపిఒ సఫరున్నీసా బేగం, ఆర్‌డిటి టీం లీడర్ నారాయణ, గోనెగండ్ల సిఐ గంగాధర్, ఎంఇఒలు రామాంజనేయులు, నీలకంఠ తెలిపారు. శుక్రవారం గోనెగండ్లలోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలో ఆర్‌డిటి ఐసిడిఎస్ ఆధ్వర్యంలో బాలల హక్కులు, బాల్యవివాహాలు, లైంగిక వేధింపులపై అవగాహన కల్పించారు. ఆర్‌డిటి సిఒ సుబ్బన్న, కెజిబివి ప్రిన్సిపల్ విద్యావతి పాల్గొన్నారు.

ఘనంగా దామోదర సంజీవయ్య జయంతి

ప్రజాశక్తి- దేవనకొండ

దేవనకొండ పంచాయతీ ఆవరణలో మాజీ ముఖ్యమంత్రి దామోదరం సంజీవయ్య జయంతి వేడుకలను శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా టిడిపి సీనియర్ నాయకులు మలకన్న, పంచాయతీ సిబ్బంది మహేష్, ఇనయతుల్లా మాట్లాడారు. దామోదరం సంజీవయ్య 1960వ సంవత్సరంలోనే పేదల కోసం సంక్షేమం అమలు చేసిన మొదటి ముఖ్యమంత్రి అని తెలిపారు. రైతు సంక్షేమం కోసం ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో అనేక సాగు, తాగునీటి, ప్రాజెక్టులు దామోదరం సంజీవయ్య సాగర్, వరదరాజుల ప్రాజెక్ట్, వంశధార పులిచింతల ఏర్పాటు చేశారని కొనియాడారు. **ఆస్పరిలో** మాల మహానాడు మండల నాయకులు వీరేష్ అధ్యక్షతన దామోదరం సంజీవయ్య జయంతి నిర్వహించారు. మాల మహానాడు జిల్లా అధ్యక్షులు మహానంది, నాయకులు భరత్, హరి, రంగస్వామి, దినేష్, రంగ నాయకులు పాల్గొన్నారు. **మంత్రాలయం** జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయులు హంపయ్య ఆధ్వర్యంలో దామోదరం సంజీవయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.


దేవనకొండలో చిత్రపటానికి నివాళులర్పిస్తున్న పంచాయతీ సిబ్బంది

విద్యా కమిటీ ఛైర్మన్ నరసింహులు, ఉపాధ్యాయులు చంద్రశేఖర్, వితోభరావు, ప్రసన్న కుమారి, వరలక్ష్మి పాల్గొన్నారు. **ఎమ్మిగనూరు** పట్టణంలో దళిత రచయితల సంఘం ప్రధాన కార్యదర్శి, ఉపాధ్యాయులు పి.మాదన్న అధ్యక్షతన దామోదరం సంజీవయ్య జయంతి నిర్వహించారు. సంఘం గౌరవాధ్యక్షులు కదిరికోట ఆదెన్న, వ్యవస్థాపక అధ్యక్షులు, ఉపాధ్యాయులు ఆరెకంటి భాస్కర్ సంజీవయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కె.తిమ్మాపురం మల్లేష్, జగతాప్ జయపాల్, మార్కు, దళిత చర్మకారులు జె.బాబు, మారెప్ప పాల్గొన్నారు.



మంత్రాలయంలో...


ర్యాలీ నిర్వహిస్తున్న భాష్యం విద్యార్థులు

'భాష్యం' విజయోత్సవ ర్యాలీ

ప్రజాశక్తి - ఆదోని

ఆదోని పట్టణంలో భాష్యం విద్యార్థులు శుక్రవారం విజయోత్సవ ర్యాలీ నిర్వహించారు. ఇఎస్ఐ ఆస్పత్రి భాష్యం స్కూల్ నుంచి నినాదాలు చేస్తూ ప్రదర్శన చేపట్టారు. భాష్యం స్కూల్ ప్రిన్సిపల్ సురేంద్రబాబు మాట్లాడుతూ... జెఇఇ మెయిన్స్ ఎగ్జామ్‌లో 14 లక్షల మంది విద్యార్థులు పరీక్ష రాయగా 14 మందికి వంద శాతం వచ్చిందని తెలిపారు. ఇందులో గుత్తికొండకు చెందిన భాష్యం విద్యార్థిని సాయి మనోజ్ఞ మొదటి స్థానంలో నిలిచారని చెప్పారు. విన్నర్స్ వరల్డ్ భాష్యం స్కూల్‌కు సొంతమని కొనియాడారు. ఆదోని భాష్యం-1 బ్రాంచిలోనూ జయదీప్‌కు 99.7 పర్సెంటైల్ రావడం గర్వించదగ్గ విషయమన్నారు. సులీక్‌కు 90 శాతం మార్కులు వచ్చాయని తెలిపారు. ప్రజలకు తెలియాలని పట్టణంలో విజయోత్సవ ర్యాలీ నిర్వహించినట్లు చెప్పారు. ఎన్‌టిఆర్ సర్కిల్, భీమాస్ సర్కిల్, రైల్వే సర్కిల్ మీదుగా ఈ విజయోత్సవ ర్యాలీ సాగినట్లు తెలిపారు. రాష్ట్ర విద్యాసంస్థలు విద్యార్థుల మానసిక, శారీరక అభివృద్ధికి ఎంతగానో తోడ్పడుతున్నాయన్నారు. ప్రధానోపాధ్యాయులు శిరీష, వైస్ ప్రిన్సిపల్ భార్గవ్ పవన్, పిఇటిలు పవిత్ర, శంకర్, సుధాకర్ ఉన్నారు.

కంటి ఉచిత శిబిరానికి విశేష స్పందన

ప్రజాశక్తి - కోసిగి

పట్టణంలోని మార్కండేయ కళ్యాణ మండపంలో శుక్రవారం నిర్వహించిన కంటి ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. శిబిరానికి మండలంలోని వివిధ గ్రామాల ప్రజలు భారీగా హాజరయ్యారు. ఎమ్మిగనూరులోని ఆర్‌కె కంటి వైద్యశాల వారితో డాక్టర్ హేమంత్ కుమార్ బృందం ఆధ్వర్యంలో కంటి పరీక్షలు నిర్వహించారు. కంటిలో పొర రావడం, కళ్లు సరిగా కనిపించకపోవడం వంటి పరీక్షలు నిర్వహించారు. ఎక్కువ మోతాదులో సమస్య ఉన్న వారికి ఆరోగ్యశ్రీ కింద తమ ఆస్పత్రిలో ఉచిత ఆపరేషన్ చేస్తామన్నారు. ఉచిత వైద్య శిబిరానికి దాదాపు 300 మంది హాజరయ్యారు. సమస్యను బట్టి వారికి మందులు పంపిణీ చేశారు.

జాతర ఏర్పాట్లపై సమీక్ష


మాట్లాడుతున్న నాయకులు

ప్రజాశక్తి - కోసిగి


ఈనెల 17న కోసిగిలో జరిగే శ్రీరేణుక ఎల్లమాంబ జాతర ఏర్పాట్లపై అధికారులు సమీక్ష నిర్వహించారు. శుక్రవారం కోసిగి పంచాయతీ కార్యాలయంలో సర్పంచి అయ్యమ్మ అధ్యక్షతన తహశీల్దార్ రుద్రగౌడ్ ఆధ్వర్యంలో అధికారులు, నాయకులతో సమీక్ష నిర్వహించారు. జాతరకు వచ్చే భక్తులకు తాగునీరు, విద్యుత్, ట్రాఫిక్ సమస్యలపై చర్చించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. జాతరకు వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా అన్ని ఏర్పాట్లను చేయాలని ఆయా శాఖల అధికారులను ఆదేశించారు. జాతరలో ఆకతాయిల ఆగడాలు, దొంగతనాలు చేసే వారిపై ప్రత్యేక నిఘా ఉంచుతున్నట్లు పోలీసు శాఖ పేర్కొంది. స్థానికంగా నెలకొన్న సమస్యలపై చర్చించారు.

బోరు బావికి విద్యుత్ కలెక్షన్ ఇవ్వండి

- సర్పంచి ఉమాదేవి, సిపిఎం నాయకులు

ప్రజాశక్తి-ఆదోనిరూరల్

బోరు బావికి విద్యుత్ కనెక్షన్ ఇవ్వాలని సర్పంచి ఉమాదేవి, సిపిఎం నాయకులు గోవిందు, పాండురంగ కోరారు. శుక్రవారం వారు మాట్లాడారు. మండలంలోని పాండవగల్ గ్రామంలో


మాట్లాడుతున్న నాయకులు

గ్రామీణ మంచినీటి సరఫరా విభాగం ఆధ్వర్యంలో బోరు వేశారని తెలిపారు. పంచాయతీ నిధులతో రెండుసార్లు ఫ్లషింగ్ చేయడంతో పాటు మోటార్ అమర్చి రైతుల అనుమతితో విద్యుత్ తీసుకొని గ్రామానికి కొన్ని రోజుల పాటు నీటిని సరఫరా చేశారని చెప్పారు. విద్యుత్ కనెక్షన్ నేటి వరకు ఇవ్వలేదని, అధికారుల దృష్టికి తెచ్చినా పట్టించుకోవడం లేదని విమర్శించారు. ప్రభుత్వం స్పందించి బోరుకు విద్యుత్ కనెక్షన్ మంజూరు చేయాలని డిమాండ్ చేశారు.

మాలల ఆర్థికాభివృద్ధిపై దృష్టి సారించాలి

- టిడిపి ఎస్సీ సెల్ నాయకులు

ప్రజాశక్తి - ఆదోని/హొళగుంద

కర్నూలు జిల్లాలో ఆర్థికంగా వెనుకబడిన మాలల సంక్షేమంపై దృష్టి సారించాలని టిడిపి ఎస్సీ సెల్ రాష్ట్ర కార్యదర్శి లక్ష్మీనారాయణ కోరారు. శుక్రవారం మంగళగిరిలో మాల కార్పొరేషన్ కార్యాలయంలో కార్పొరేషన్ ఛైర్మన్ విజయ్ కుమార్‌ను మర్యాదపూర్వకంగా కలిసి శాలువా, పుష్పగుచ్ఛంతో సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. కర్నూలు పశ్చిమ ప్రాంతంలో మాలల అభివృద్ధికి సలహాలు, సూచనలు ఇచ్చినట్లు తెలిపారు. భవిష్యత్తులో కర్నూలు పశ్చిమ ప్రాంతంలో పర్యటించి మాలల అభివృద్ధికి కార్యాచరణ రూపొందిస్తానని ఛైర్మన్ విజయ్ కుమార్ హామీ ఇచ్చారన్నారు. నాయకులు బాలాజీ, వన్నూరప్ప, గోపాల్, మల్లికార్జున, గిరి ఉన్నారు.


కార్పొరేషన్ ఛైర్మన్‌ను కలిసిన నాయకులు



మాట్లాడుతున్న సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్

ముగిసిన రాజ్య పురస్కార్ టెస్టింగ్ క్యాంపు

- నవోదయలో చదివితే అభివృద్ధి - సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు రూరల్

జవహర్ నవోదయ విద్యాలయంలో రాజ్య పురస్కార్ టెస్టింగ్ క్యాంపు శుక్రవారం ముగిసింది. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, పుదుచ్చేరి రాష్ట్రాల నుంచి 16 నవోదయ విద్యాలయాల భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్ హాజరయ్యారు. ముఖ్య అతిథిగా ఆదోని సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్, హాజరయి జ్యోతి ప్రజ్వలన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. తాను నవోదయలో చదవడం వల్ల అభివృద్ధి సాధించినట్లు తెలిపారు. నవోదయాలో నేషనల్ ఇంటెగ్రిటీ (జాతీయ సమైక్యత) వల్ల అన్ని భాషలపైనా పట్టుసాధించవచ్చని చెప్పారు. విద్యాలయంలో గ్రంథాలయాలను సద్వినియోగం చేసుకోవాలని, రోజూ పత్రిక పఠనం చేయడం వల్ల కొత్త విషయాలను తెలుసుకోవచ్చని తెలిపారు. బట్టీ విద్యకు స్వస్తి పలకాలని, విషయాన్ని అర్థం చేసుకొని చదవాలని సూచించారు. జవహర్ నవోదయ విద్యాలయ ప్రిన్సిపల్ ఈ.పద్మావతి, విద్యాలయ వైస్ ప్రిన్సిపల్ కె.చందిరన్, శ్రీనివాసరావు, వెంకటేష్, ఎల్ఒసి స్కౌట్స్ బాబురావు, నిం బూరె, ఎల్ఒసి గైడ్ మల్లేశ్వరి, శిక్షణ పరిశీలకులు అనిల్ శాస్త్రి, రమేష్, శివ కుమార్, విద్యాలయ స్కౌట్ మాస్టర్ శశికిరణ్, గైడ్ కెప్టెన్ మీనా చంద్రన్ పాల్గొన్నారు.

అంగన్వాడీల సమస్యలు పరిష్కరించాలి

- 17న సిడిపిఒ కార్యాలయం ముందు ధర్నా : సిఐటియు

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు

అంగన్వాడీల సమస్యలు పరిష్కరించాలని అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ ప్రాజెక్ట్ కార్యదర్శి బి.గోవర్ధనమ్మ, అర్బన్ కార్యదర్శి ఎస్.నాగలక్ష్మి, సిఐటియు తాలూకా కార్యదర్శి బి.రాముడు డిమాండ్ చేశారు. శుక్రవారం సిఐటియు ఆధ్వర్యంలో సిడిపిఒ కార్యాలయ సిబ్బందికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. గత ప్రభుత్వం అంగన్వాడీల పట్ల నిర్లక్ష్యం వహించిందని తెలిపారు. 42 రోజుల సమ్మె సందర్భంగా అంగన్వాడీ శిబిరాలకు టిడిపి నాయకులు మద్దతిచ్చి ప్రభుత్వం వచ్చిన వెంటనే అంగన్వాడీల సమస్యలను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారని చెప్పారు. 9 నెలలు దాటినప్పటికీ సమస్యలపై స్పందించకపోవడం శోచనీయమన్నారు. డిమాండ్ల సాధనకు ఈనెల 17న సిడిపిఒ కార్యాలయం ముందు ధర్నా చేపడుతున్నట్లు తెలిపారు. అంగన్వాడీ యూనియన్ నాయకులు మల్లేశ్వరి, శకుంతల, రామలింగమ్మ పాల్గొన్నారు.

'కరువు ప్రాంతంపై దృష్టి సారించండి'

ప్రజాశక్తి - చిప్పగిరి

జిల్లా పశ్చిమ ప్రాంతంలోని ఆలూరు నియోజకవర్గంలో అనేక సమస్యలు నెలకొన్నాయని, సమస్యల పరిష్కారానికి నిధులు మంజూరు చేయాలని ముఖ్యమంత్రి చంద్రబాబును కోరినట్లు తెలుగు యువత జిల్లా మాజీ నాయకులు మేకల రవి యాదవ్ కోరారు. శుక్రవారం ఆయన మాట్లాడారు. నియోజకవర్గంలోని ఆరు మండలాల్లో చాలా సమస్యలు ఉన్నాయని, వేదవతి, నగరడోనా రిజర్వాయర్ పనులు పూర్తి కావాలంటే నిధులను విడుదల చేయాలని కోరారు. ఈ రెండు రిజర్వాయర్లు పూర్తయితే రైతులు వలస వెళ్లకుండా పంటలు సాగు చేసుకుంటారన్నారు. పత్తికొండ దగ్గర ఉన్న పందికోన రిజర్వాయర్‌కు పిల్ల కాలువలు పూర్తి చేస్తే అక్కడ ఉన్న రైతులందరికీ సాగు చేసుకోవడానికి వెసలుబాటు ఉంటుందని తెలిపారు. సమస్యలపై ముఖ్యమంత్రి సానుకూలంగా స్పందించినట్లు ఆయన తెలిపారు.

పొదుపు సంఘాలను బలోపేతం చేయాలి

- అసిస్టెంట్ కమిషనర్ అనుపమ

ప్రజాశక్తి - ఆదోని

పొదుపు సంఘాలను ఆర్థికంగా బలోపేతం చేస్తూ పేదరిక నిర్మూలన కృషి చేయాలని మున్సిపల్ అసిస్టెంట్ కమిషనర్ అనుపమ తెలిపారు. శుక్రవారం ఆదోని మున్సిపాలిటీలో పట్టణ ఎస్‌హెచ్‌జి మహిళలకు మెప్మా కార్యక్రమాలపై మెప్మా మిషన్ డైరెక్టర్ ఎన్.తేజ్ భరత్ జూమ్ మీటింగ్ ద్వారా అవగాహన కల్పించారు. మార్చి 8న స్టాల్స్ ఏర్పాటు చేసి అమ్మకాలు ప్రోత్సహించాలని తెలిపారు. పట్టణంలో ప్రతి మహిళా ఆర్థికంగా లబ్ధి పొందేలా చూడాలని అసిస్టెంట్ కమిషనర్ అనుపమ సూచించారు. సిఎంఎం జిలాని బాష్, సిఒ జావిద్ ఉన్నారు.



మాట్లాడుతున్న సీనియర్ న్యాయవాది వై.జయరాజు

సంజీవయ్య స్ఫూర్తితో సంక్షేమ హాస్టల్ రక్షణకు ఉద్యమం

కెవిపిఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎండి ఆనంద్ బాబు

ప్రజాశక్తి-కర్నూలు హాస్పిటల్

మాజీ ముఖ్యమంత్రి దామోదరం సంజీవయ్య స్ఫూర్తితో పెద్దపాడులోని సంక్షేమ హాస్టల్ రక్షణకు ఉద్యయం చేపడుదామని కెవిపిఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎండి.ఆనంద్‌బాబు పిలుపునిచ్చారు. కుల వివక్ష వ్యతిరేక పోరాట సంఘం(కెవిపిఎస్) ఆధ్వర్యంలో ఆంధ్ర రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి దామోదరం సంజీవయ్య 104వ జయంతి కార్యక్రమాన్ని పెద్దపాడు గ్రామంలోని సంక్షేమ వసతి గృహంలో ఘనంగా నిర్వహించారు. ఎం డి ఆనంద్ బాబు, న్యూ సిటీ అధ్యక్షులు యేసు రాజు, జిల్లా నాయకులు ఎన్. చక్రపాణి దామోదరం సంజీవయ్య విగ్రహానికి పూలమాలవేసి జయంతి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం విద్యా సదన్ ఉన్న ప్రాంతాన్ని పరిశీలించి విద్యార్థుల ద్వారా సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఎండి ఆనంద్‌బాబు మాట్లాడుతూ స్వార్ధ రాజకీయాలు పరిడవిల్లుతున్న నేటి సమాజంలో మట్టిలో మాణిక్యం లాగా అవినీతి మరక అంటని రాజకీయ నాయకుడు సంజీవయ్య అన్నారు. సంజీవయ్య జయంతి కార్యక్రమాన్ని నిర్వహించడం అంటే ఆయన కొనసాగించిన సామాజిక సేవను మరింత ముందుకు తీసుకుపోవడం అని అన్నారు. జయంతి రోజున దండవేసి దండం పెట్టి రాష్ట్ర వ్యాప్తంగా కార్యక్రమాన్ని నిర్వహించామని చప్పట్లు కొట్టుకుంటే సరిపోదని అన్నారు. జిల్లా కేంద్రానికి 10 కిలోమీటర్ల దూరంలో ఉన్న సంజీవయ్య పుట్టిన గ్రామం పెద్దపాడు నేటికీ సమస్యలకు నిలయంగానే ఉందన్నారు. గ్రామంలోని ప్రజలు మంచినీటి సమస్యతో ఇబ్బంది పడుతున్నారన్నారు. సంక్షేమ హాస్టల్ల నిర్వహణలో ఉన్న లోపం వల్ల 108 ఉన్న ఎస్సీ సంక్షేమ హాస్టల్లో 38 కి తగ్గి పోయాయన్నారు. దామోదరం సంజీవయ్య స్వగ్రామంలో ఎకరా స్థలంలో ఉన్న సంక్షేమ హాస్టల్ ను నిరుపయోగంగా మారుస్తున్నారన్నారు. కేవలం 46 మంది విద్యార్థులు మాత్రమే అందులో విద్యను అభ్యసిస్తున్నారని, హాస్టల్ పరిసర ప్రాంతమంతా అశుభ్రంగా తయారైందన్నారు. హాస్టల్ ను సైతం కొద్ది మంది రాజకీయ నాయకులు కబ్జా చేసుకుంటున్నట్లు ప్రయత్నం జరుగుతోందని, గ్రామస్తులు బహిరంగంగానే చర్చించుకుంటున్నారన్నారు. పెద్దపాడు గ్రామంలో ఉన్న సంక్షేమ హాస్టల్ను రక్షించుకోవడంతో పాటు జిల్లా వ్యాప్తంగా దళితులు, పేదలు చదువుకునే సంక్షేమ హాస్టల్ల రక్షణ కోసం పోరాడడమే సంజీవయ్యకి ఇచ్చే ఘనమైన నివాళి అని వారు తెలిపారు. చిన్న రామన్న, పెద్ద రాజు, సుంకన్న, నాగమద్దిలేటి, చిన్న రాజు, చంటి తదితరులు పాల్గొన్నారు.



పెద్దపాడులో దామోదరం సంజీవయ్య విగ్రహానికి పూలమాల వేస్తున్న ఎండి ఆనంద్‌బాబు

నీతికి నిజాయితీకి మారుపేరు దామోదరం సంజీవయ్య

ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్

నీతికి, నిజాయితీకి మారుపేరు అయిన దామోదరం సంజీవయ్య జిల్లాగా కర్నూలు జిల్లాకు నామకరణం చేయాలని సీనియర్ న్యాయవాది, కర్నూలు ,ఎపి హైకోర్టు అధ్యక్షుడు నేషనల్ లాయర్స్ ఫోరం కన్వీనర్ వై.జయ రాజు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఉమ్మడి ఎపి తొలి దళిత ముఖ్యమంత్రి, మాజీ కేంద్ర మంత్రి , భారత జాతీయ కాంగ్రెస్ అధ్యక్షుడు దామోదరం సంజీవయ్య 104వ జన్మదిన వేడుకలను శుక్రవారం కర్నూలులో ఆయన విగ్రహానికి పూలమాల వేసి ఘనంగా నిర్వహించారు. జయరాజు మాట్లాడుతూ ప్రజా జీవితంలో ఆయన నిజాయితీ, సమగ్రతను , దేశానికి చేసిన సేవలను గుర్తు చేసుకున్నారు. ఆయన నాయకత్వాన్ని గుర్తు చేసుకునే విధంగా కర్నూలు జిల్లాను దామోదరం సంజీవయ్య జిల్లాగా పేరు పెట్టాలని అన్నారు. ఫోరం నాయకులు ఎ. మాదన్న, బి.చిన్నయ్య, ఎం.సుబ్బయ్య, జాన్ బాబు, ఎం.రవిరాజు, నాగప్ప, పాపారావు, అయ్యస్వామి, నాగముని తదితరులు పాల్గొన్నారు.

జివి మాల్‌లో పెళ్లి కానుకలు..! ఆఫర్ల వేడుకలు..!!

ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్

కర్నూలు నగరంలో వెంకటేష్ థియేటర్ ఎదురుగా ఉన్న జి. వి మాల్ లో పెళ్లి ,శుభకార్యాలకు, చిన్నపిల్లలకు వస్త్ర కొనుకోలుకు సరికొత్త ఆఫర్లు ఇస్తున్నామని మార్కెటింగ్ మేనేజర్ తెలిపారు. అన్ని వస్త్రాలపై ధరలపై తగ్గింపు! ధరలతో జివి మాల్ అందుబాటులోకి తెచ్చిందన్నారు. రూ.50000 పైగా షాపింగ్ చేసిన వాటికి రూ.5000 గిఫ్ట్ వోచర్ ఇస్తున్నామన్నారు. రూ.75000 పైగా షాపింగ్ చేసిన వాటికి రూ.7500 గిఫ్ట్ వోచర్ ఇస్తున్నామని తెలిపారు. రూ.100000 పైగా షాపింగ్ చేసిన వాటికి రూ.10000 గిఫ్ట్ వోచేర్ ఇస్తామన్నారు. ఇవే కాక రూ.10000 కొనుగులు పై రూ.1999 విలువ గల డఫ్ఫెల్ బ్యాగ్ రూ.149కే ఇస్తున్నామన్నారు. ఈ ఆఫర్లను ప్రజలు ఉపయోగించుకోవాలి కోరారు.

చంద్రబాబు స్వేచ్ఛనిస్తారు

ప్రజాశక్తి-కర్నూలు క్రైమ్

ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు చట్టం తన పని తాను చేసుకునే సహకరించే వ్యక్తి తప్ప వ్యక్తిగత కక్షలకు పూనుకునే మనస్తత్వం ఆయనది కాదని టిడిపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, కుడా చైర్మన్ సోమిశెట్టి వెంకటేశ్వర్లు అన్నారు. శుక్రవారం ఆయన తన కార్యాలయంలో విలేకరుల సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జగన్‌లా స్వార్ధ ప్రయోజనాల కోసం వ్యవస్థలను నిర్వీర్యం చేసే వ్యక్తి చంద్రబాబునాయుడు కాదని, వ్యవస్థలకు పూర్తి స్థాయి స్వేచ్ఛనిస్తారనీ అన్నారు. తప్పుచేస్తే సొంత పార్టీవారినైనా ఉపేక్షించబోననీ పార్టీ నాయకులకు కార్యకర్తలకు కూడా హెచ్చరిక చేశారన్నారు. వైసిపి మాజీ ఎమ్మెల్యే వల్లభనేని వంశీని చంద్రబాబు నాయుడు కక్షపూరితంగా పోలీసులతో అరెస్టు చేయించారని వైసీపీ నాయకుడు అంబటి రాంబాబు ఆరోపించడం హాస్యాస్పదంగా ఉందన్నారు. గంట, అరగంట అంటూ మహిళలను వేదించిన అంబోతు అంబటి రాంబాబని దుయ్యబట్టారు. గతంలో అధికార మదంతో చేసిన పాపాలు, నేరాలు అన్నీ ప్రజలు గమనించే మీకు బుద్ధి చెప్పి సాగనంపి, తెలుగుదేశంపార్టీకి పట్టం కట్టారన్నారు. టిడిపి నాయకులు కార్యకర్తలు తమ అధికారంలోకి రాగానే తమకు జరిగిన అన్యాయాలపై తగిన గుణపాఠం చెప్పాలని తలచినా చంద్రబామునాయుడు కక్షపూరిత రాజకీయాలను ప్రోత్సాహించేలేదనీ అన్నారు. ఈ కారణంగానే చట్టానికి మీపై చర్యలు తీసుకునేందుకు 8 నెలల కాలం పట్టిందన్న సంగతి గుర్తుంచుకోవాలన్నారు. వంశీ టిడిపి కార్యాలయాన్ని ధ్వంసం చేయించడం, తగులబెట్టించడం, మహిళలపై హత్యాచారాలకు పాల్పడటం, భూ కబ్జాలు, దౌర్జన్యాలు, దమనకాండలు, వంటి వాటివేకాకుండా సాక్షులుగా ఉన్న సత్యవర్ధన్ అనే వ్యక్తిని కిడ్నాప్ చేయించి చిత్రహింసలకు గురిచేసిన నీచుడు అన్నారు. వంశీ అలాంటి వారిని వెనకేసుకొస్తున్న వైసిపి వారికి నీతి, సిగ్గు, లజ్జా అనేవి లేవనీ ఆరోపించారు. ప్రజలు దయ తలచి ఒక్క అవకాశం ఇచ్చినందుకు రాష్ట్రాన్ని '0' చేశారు. అధికారం చేతిలో ఉందనీ చేయకూడని ఘోరాలన్నీ చేశారన్నారు. ఇక మీకందరికి జైలు జీవితం తప్పదని, ఇప్పుడు నీతులు వల్లిస్తే నమ్మేందుకు ప్రజలు సిద్ధంగా లేరన్నారు. నారా లోకేష్ రెడుబుక్ గురించి మాట్లాడే వైసిపి నాయకులకు రెడుబుక్ అంటే ఎందుకంత ఉలుకని ఎద్దేవ చేశారు. అందులో ప్రజలకు అన్యాయం చేసిన వారి గురించి మాత్రమే పొందుపర్చారు. రెడ్‌బుక్ తెరువవలేదన్న విషయాన్ని గుర్తుంచుకొని మసలుకుంటే మీకే మంచిదన్నారు. లేదనీ మరోసారి చంద్రబాబుపైన సంబంధంలేని అంశాలు గురించి మాట్లాడితే తిప్పలు తప్పవని హెచ్చరించారు.



టమోటా విక్రయాల నిలిపివేత

ప్రజాశక్తి-పత్తికొండ

పత్తికొండ వ్యవసాయ మార్కెట్‌లో టమోటా క్రయవిక్రయాలు శనివారం నుండి నిలిపివేస్తున్నట్లు పత్తికొండ మార్కెట్ యార్డ్ సెక్రెటరీ కార్నలిస్ పేర్కొన్నారు.శుక్రవారం మీడియాతో ఆయన మాట్లాడారు. మార్కెట్లోని టమోటా వ్యాపారస్తులు టమోటాను క్రయ విక్రయాలు నిలిపివేస్తున్నట్లు లిఖితపూర్వకంగా వినతి పత్రాన్ని అందజేశారని తెలిపారు. టమోటా పంటను మార్కెట్‌కు తీసుకురావద్దని రైతులకు తెలిపారు.



కోడుమూరు తిరుణాలలో ప్రథమ చికిత్స కేంద్రాలు ఏర్పాటు

ప్రజాశక్తి - కోడుమూరు రూరల్

కోడుమూరు శ్రీ చౌడేశ్వరీ దేవి తిరుణాల మహోత్సవం సందర్భంగా ఉచితంగా వైద్య సేవలు అందిస్తున్నారు. కోడుమూరు ప్రజల , చౌడేశ్వరి దేవి ఆలయ తిరుణాల స్టీరింగ్ కమిటీ కోరిక మేరకు ప్రజలకు , క్రీడాకారుల సౌకర్యార్థం కో లోకేటెడ్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం కోడుమూరు వైద్యాధికారి డాక్టర్ ఎం .మదన్ శేఖర్ ఆధ్వర్యంలో కోడుమూరు సంత మార్కెట్ , జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో ప్రథమ చికిత్స కేంద్రాలు బుధవారం నుండి శుక్రవారం వరకు వరకు ఏర్పాటు చేసి వైద్య సేవలు అందిస్తున్నారు. ఈ ప్రథమ చికిత్స కేంద్రాలలో కో లోకేటెడ్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆరోగ్య విస్తరణాధికారి నరసప్ప , హెల్త్ సూపర్వైజర్స్ కమాల్ సాహెబ్ , ఉమాబాయి , కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్లు ఆరోగ్య కార్యకర్తలు , ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రతి వైద్యుడు ఎథిక్స్ కలిగి ఉండాలి

మెడికల్ ఎథిక్స్ పై కొత్తగా వైద్యరంగంలో కి ప్రవేసించబోయే వైద్యులకు అవగాహన

ప్రజాశక్తి కర్నూలు హాస్పిటల్

ప్రతి వైద్యుడు రోగుల పట్ల మానవత్వంతో వ్యవహరించాలని వైద్య వవృత్తిలో క్యారెక్టర్‌కు ఎంతో ప్రాధాన్యత ఉంటుందని డాక్టర్లకు ఎథిక్స్ పై అవగాహన కార్యక్రమంలో కార్డియోథొరాసిక్ విభాగాధిపతి డాక్టర్ సి ప్రభాకర్ రెడ్డి అన్నారు. శుక్రవారం కర్నూలు మెడికల్ కళాశాలలో ఇంటర్నిషిప్ పూర్తి చేసుకున్న విద్యార్థులకు వైద్య వృత్తిలో ఎథిక్స్ పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య వక్తగా పాల్గొన్న ఆయన మాట్లాడుతూ ప్రతి వైద్యుడు ఎపి మెడికల్ కౌన్సిల్లో సభ్యులు గా రిజిస్ట్రేషన్ విధిగా చేసుకోవాలన్నారు. ప్రాక్టీస్ చేసే ప్రతి వైద్యుడు తన రిజిస్టర్ నంబర్, ఎన్ఎంసీ గుర్తింపు గల డిగ్రీ లను మాత్రమే బోర్డు పైన ప్రిస్క్రిప్షన్ పాడ్ పైన చూపాలని, తన ప్రిస్క్రిప్షన్‌లో మందు జెవరిక్ పేరును రాయాలని కంపెనీ పేరు కాదని తెలిపారు.. అత్యవసర పరిస్థితుల్లో ఏ రోగైనా తన వద్దకు వస్తే విధిగా వారికి సేవ చేయాలని తన విభాగం కాదని వెనక్కి పంపరాదన్నారు. అత్యవసర పరిస్థితుల్లో ప్రాథమిక చికిత్స చేసిన తరువాతనే నిర్దేశిత విభాగానికి పంపాలని తెలిపారు. ప్రతి వైద్యుడు వైద్య సేవలు రికార్డును కనీసం మూడు సంవత్సరాలు మెయింటైన్ చేయాలని రోగికి తన వైద్య సేవల రికార్డును పొందే హక్కు ఉంటుందని రోగి అడిగిన 72 గంటల లోపుల అతని రికార్డు తనకు ఇవ్వాల్సివుంటుంది అన్నారు. ప్రజలు వైద్యులను దేవుడిగా భావించి గౌరవిస్తారని, ఆ గౌరవాన్ని మనం నిలబెట్టుకోవాలన్నారు. సేవా దక్పథంతో మనం ముందుకు వెళితే మనకు సమాజంలో గౌరవం డబ్బు అదంతకదే వస్తాయని, మనం గొప్ప చదువులు చదువుకున్నాం అనే అహంకారంతో కాకుండా మనం వాళ్లకు సేవకులుగా పనిచేస్తున్నామని మనం భావించినప్పుడు మనకు తప్పకుండా కావలసిన గౌరవం సమాజం మనకు ఇస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమానికి అధ్యక్షత వహించిన అడిషనల్ డైరెక్టర్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్ కాలేజీ ప్రిన్సిపల్ డాక్టర్ కె. చిట్టి నరసమ్మ మాట్లాడుతూ ప్రతి వైద్యుడు విలువలతో కూడిన వైద్యం చేయాలని రోగులు ఎడల గౌరవభావం కలిగి ఉండాలని అన్నారు. రోగులకు అందించిన వైద్య సేవలు విషయంలో ప్రతి సేవలు రికార్డు చేయడం ఎంతో అవసరమని అది అత్యవసర సమయాల్లో వైద్యులకి ఎంతో ఉపయోగపడుతుందన్నారు. ఆసుపత్రి సూపరిండెంట్ డాక్టర్ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ వైద్యులు రోగికి సేవలు అందించే విషయం ప్రతిదీ తెలియచేయాలని అది వారి హక్కు అని అన్నారు. క్లిష్ట పరిస్థితుల్లో రోగి బంధువులకు వాస్తవ విషయాలు తెలియజేయాలని వారి అనుమతితోనే తదుపరి చర్యలకు ముందుకు వెళ్లాలన్నారు. వైద్య సేవలో విలువలు చాలా ముఖ్యమని ప్రతి వైద్యుడు తప్పక పాటించాలన్నారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రెసిడెంట్ డాక్టర్ హరి చరణ్, హౌస్ సర్జన్ పూర్తి చేసుకున్న విద్యార్థులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మెడికల్ కళాశాల ప్రిన్సిపల్ చిట్టినరసమ్మ వేదికపై ప్రభాకర్‌రెడ్డి, తదితరులు

రాష్ట్ర నెట్ బాల్ కు జిల్లా క్రీడాకారుల ఎంపిక

ప్రజాశక్తి - కర్నూలు జిల్లాపరిషత్

రాష్ట్రస్థాయి జూనియర్ నెట్ బాల్ పోటీలకు కర్నూల్ జిల్లా ఆర్ కొంతల పాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థుల ఎంపికయ్యారు. ఈ సందర్భంగా పాఠశాల లో ఏర్పాటు చేసిన అభినందన సభలో పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు సావిత్రి ముఖ్య అతిథిగా పాల్గొని క్రీడాకారులను అభినందించారు. ఆమె మాట్లాడుతూ యేసురాజు, మహేష్ కర్నూలు జిల్లా జూనియర్ నెట్ బాల్ బాలుర జట్టుకు ఎంపికైనట్లు తెలిపారు. ఎంపికైన క్రీడాకారులు 15, 16 తేదీలలో రావులపాలెం లో జరిగే రాష్ట్రస్థాయి నెట్ బాల్ ఛాంపియన్షిప్ పోటీలలో పాల్గొంటారని, విద్యార్థులను క్రీడల్లో ప్రోత్సహిస్తున్న తల్లిదండ్రులను అభినందించారు. తమ పాఠశాలలో క్రీడలకు ప్రాముఖ్యత ఇస్తున్నట్లు తెలిపారు. రాష్ట్రస్థాయి నెట్ బాల్ పోటీలలో జిల్లాకు పేరు ప్రతిష్టలు తీసుకు రావాలని, అదేవిధంగా రాష్ట్ర జట్టుకు ఎంపిక కావాలని కోరారు. క్రీడలలో విద్యార్థులను ప్రోత్సహిస్తున్న పాఠశాల వ్యాయామ ఉపాధ్యాయుడు రాజశేఖర్ ను ఆమె అభినందించారు.

